దారి పొడవునా భారీ గోతులు

- చెరువులను తలపిస్తున్న వైనం
- నరకాన్ని చూపుతున్న ఏడీబీ రోడ్డుపై ప్రయాణం
- తరచూ ప్రమాదాలతో ట్రాఫిక్ జాం

రాజానగరం: మొన్నటి వరకు నాణ్యతతో కూడిన పనులకు ఆనవాలుగా నిలిచిన రహదారి నేడు ప్రయాణికులకు నరకాన్ని తలపించేలా తయారైంది. కారణాలు ఏమైనాగానీ ఏడీబీ రోడ్డుపై ప్రయాణం అంటేనే ప్రయాణికులు హడలిపోతున్నారు. రహదారి విస్తరణలో భాగంగా లోతుగా తవ్విన ప్రాంతాలను పూడ్చకుండా అలాగే వదిలేయడంతోపాటు పడిన గోతులను పట్టించుకోకపోవడంతో అవి క్రమేపీ పెద్దవిగా మారుతున్నాయి. ముఖ్యంగా రాజానగరం నుంచి రంగంపేట వరకు ఈ రహదారిపై పలుచోట్ల భారీగా పడిన గోతులలోకి ప్రస్తుతం కురుస్తున్న వర్షం నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. దీంతో గోతులు ఏవో, రోడ్డు ఏదో తెలియని పరిస్థితులలో భారీ వాహనాలు సైతం ఆ గోతులలో పడి, కమాన్ కట్టలు వంటివి విరిగి పాడవుతున్నాయి. ఒక్కో సమయంలో వాహనాలు అదుపు తప్పి తిరగబడటంతో అటు, ఇటు రెండు వైపులా ఇతర వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. ఇటువంటి సమయంలో గంటల తరబడి ట్రాఫిక్‌జామ్ అయి ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. ఇదేవిధంగా ఆదివారం గోవిందరాజపురం లోడుతో వెళ్తున్న లారీ గోతుల్లో పడి తిరగబడటంతో ఆ వాహనంలోని డ్రైవరు, క్లీనర్లు గాయాలపాలు కాగా, ట్రాఫిక్‌జామ్ అయింది. ఈ క్రమంలో బైకులపై ప్రయాణించే వారికి కూడా పగటి పూటనే చుక్కలు కనిపించేలా ప్రయాణం సాగుతుందనడంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు.

నిధుల కొరతే కారణమా..?

ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు (ఏడీబీ) ఆర్థిక సహకారంతో రాజానగరం నుంచి కాకినాడ పోర్టుకు ఉన్న 50 కి.మీ. రోడ్డును రెండు లేన్ల రహదారిగా 1996లో అభివృద్ధి చేశారు. పనుల నాణ్యతలో ఏమాత్రం రాజీపడకుండా నిర్మించిన ఈ రహదారి చాలాకాలం చెక్కుచెదరకుండా ప్రయాణికుల మన్ననలు పొందుతూ వచ్చింది. అయితే ఉమ్మడి జిల్లా కేంద్రంగా ఉన్న కాకినాడ నుంచి వ్యాపార, వాణిజ్య, రాజకీయ, అధికార పరమైన కార్యకలాపాలు పెరగడం, రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్టుకు ఈ రహదారి అనుసంధానమై ఉండటంతో జాతీయ రహదారి మాదిరిగా నాలుగు లేన్లతో అభివృద్ధి చేయాలని పాలకులు భావించారు. ఇందుకుగాను నాబార్డు నుంచి నిధులు కూడా మంజూరయ్యాయి. వాటికి రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్స్ కలిపి, 2017లో రహదారి అభివృద్ధి పనులు ప్రారంభించారు. కొంతకాలం పనులు వేగంగా జరిగినా, అనతి కాలంలోనే వాటికి బ్రేకులు పడ్డాయి. నిధుల కొరత కారణంగా పనులు నిలిచిపోయాయంటూ ప్రచారం జరుగుతోంది. ఏదిఏమైనా చేపట్టిన పనులు పూర్తి కాక, పాత రహదారి కనుమరుగై గోతుల మయం కావడంతో ప్రయాణికులకు కష్టాలు తప్పడం లేదు. ఈ రహదారిపై పనులను వేగిరమే పూర్తి చేసేలా ప్రస్తుతం ప్రభుత్వం అయినా శ్రద్ధ తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.


ఏడీబీ రోడ్డుపై గోవిందరాజపురం వద్ద తిరగబడిన లారీ



గోతులతో చెరువులను తలపిస్తున్న ఏడీబీ రోడ్డు (గోవిందరాజపురం, ఎస్సీ రాజపురం వద్ద..)

చెరువులను తలపిస్తున్నాయి



వెంకన్నపేట నుంచి రామస్వామిపేట వరకు రహదారి పూర్తిగా దెబ్బతింది. గోతులు చెరువులను తలపించేలా తయారవడంతో నిత్యం ఏదో ఒక వాహనం తిరగబడం, ట్రాఫిక్‌జామ్ గంటల తరబడి ఏర్పడటం గత కొన్ని సంవత్సరాలుగా అలవాటైపోయింది. ఈ కష్టాలు ఎప్పటికి తీరుతాయో తెలియని వాతావరణం నెలకొంది.

– డాక్టర్ వి.కనకరాజు, తెలుగు అధ్యాపకులు, రాజానగరం

ప్రమాదం జరగని రోజు లేదు



ఏడీబీ రోడ్డుపై గోతులు పడటంతో ప్రయాణికులు సురక్షితంగా తమ గమ్యస్థానాలకు వెళ్లలేకపోతున్నారు. ప్రమాదం జరగని రోజంటూ ఉండటం లేదు. తరచుగా బైకులపై ప్రయాణించే వారు ఈ గోతులలో పడి క్షతగాత్రులవుతున్నారు. ఆదివారం లోడుతో వెళ్తున్న ఒక లారీ తిరగబడి, గంటల కొద్దీ ట్రాఫిక్ నిలిచిపోయింది.

– వట్టికూటి అప్పారావు, వ్యాన్ డ్రైవర్, రామస్వామిపేట

మళ్లీ ఉధృతంగా వరద

- అప్రమత్తమైన అధికారులు
- కొనసాగుతున్న వైద్య శిబిరాలు
- బొబ్బిల్లంక ఏటిగట్టు పటిష్టతకు చర్యలు

సీతానగరం: తగ్గినట్లే తగ్గి మళ్లీ గోదావరి వరద పోటెత్తుతుంది. తగ్గుతున్న వరదతో ఊపిరిపీల్చుకున్న అధికారులు వరద మళ్లీ పెరగడంతో ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. తిరిగి యథావిధిగా ములకల్లంక గ్రామానికి ఉరుకులు, పరుగులు పెడుతున్నారు. రెండు రోజులు గోదావరి వరద సుమారు మూడు అడుగులు తగ్గింది. శనివారం అర్ధరాత్రి నుంచి తిరిగి గోదావరి వరద నీటిమట్టం పెరగడం ప్రారంభించింది. దానితో అధికారులు గోదావరి మధ్యలో ఉన్న ములకల్లంకకు వెళ్లి గ్రామస్తులకు ధైర్యం చెబుతూ, అవసరమైతే గ్రామం నుంచి బయటకు రావాలని కోరుతున్నారు. పంచాయతీ అధికారులు శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించారు. బొబ్బిల్లంక రేవులో, ములకల్లంకలో వైద్యశిబిరాలు కొనసాగుతున్నాయి. తహసీల్దార్ నెల్సన్ పాల్‌బాబు, ఎంపీడీవో కృష్ణప్రసాద్, పంచాయతీ కార్యదర్శి రజాన్, వీఆర్వో నాగమణి, ఎస్సై టి.రామకృష్ణలు ఎప్పటికి కప్పుడు తగు చర్యలు తీసుకుంటున్నారు. బొబ్బిల్లంక రేవులో గోదావరిలోకి వెళ్లకుండా అడ్డుగా బారికేడ్లు ఏర్పాటు చేశారు.


బొబ్బిల్లంక, ములకల్లంక మధ్య ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి వరద

ఒక బోటు మాత్రమే

బొబ్బిల్లంక, ములకల్లంక మధ్య రాకపోకలకు ఒక బోటు మాత్రమే ఏర్పాటు చేశారు. వైఎస్సార్ సీపీ హయాంలో ములకల్లంక, బొబ్బిల్లంక మధ్య రాకపోకలకు రెండు లాంచీలు లేదా రెండు బోట్లు ఏర్పాటు చేసేవారు. ఒకటి పాడైనా రెండవ బోటు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకునేవారు. అయితే ఈ ఏడాది ఒక బోటుపై మాత్రమే ఇరు గ్రామాల వాసులు రాకపోకలు సాగిస్తున్నారు.


బొబ్బిల్లంక అశోక్‌నగర్ వద్ద బలహీన పడిన ఏటిగట్టును పరిశీలిస్తున్న ఆర్డీవో చైత్ర వర్షిణి

బలహీనంగా ఉన్న ఏటిగట్టు

బొబ్బిల్లంక అశోక్‌నగర్ వద్ద బలహీనంగా ఉన్న ఏటిగట్టు వద్ద అఖండ గోదావరి లెఫ్ట్ బ్యాంక్ (ఏజీఎల్‌బీ) ఏఈ శివకుమార్ ఆధ్వర్యంలో రాక్ బౌల్డర్స్‌ను డంపింగ్ చేయడానికి ఏర్పాట్లు చేశారు. ఏజీఎల్‌బీ చీఫ్ ఇంజినీర్ పుల్లారావు, ఆర్డీవో చైత్ర వర్షిణి, ఏజీఎల్‌బీ ఎస్‌ఈ శ్రీనివాస్, ఈఈ కాశీవిశ్వనాథ్‌రావు, డీఈ రమేష్ పర్యవేక్షణలో ఏఈ శివప్రసాద్ ఏటిగట్టు రక్షణ చర్యలు చేపట్టారు. లారీల నుంచి గోదావరిలోకి రాళ్లను డంపింగ్ చేయడానికి రోడ్డు మార్గం ఏర్పాటు చేస్తున్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది

సీతానగరం: గోదావరి వరద కారణంగా ముంపునకు గురైన పంట పొలాల రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుంటుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఆదివారం సీతానగరం మండలం రాపాక వద్ద ముంపులో ఉన్న పంటపొలాలను ఆయన పరిశీలించారు. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషనర్ డిల్లీరావు, కలెక్టర్ పి.ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్ ఆయన వెంట ఉన్నారు. మంత్రి మాట్లాడుతూ ఏటిగట్టు పటిష్టతకు చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. సీతానగరం మండలంలో 9 వేల ఎకరాల వరి, 300 ఎకరాల్లో కూరగాయల పంటలు, తోటలు ముంపుకు గురయ్యానని మంత్రికి కలెక్టర్ వివరించారు.


రాపాక వద్ద ముంపులో ఉన్న పంట పొలాల వివరాలను మంత్రి అచ్చెన్నాయుడికి వివరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

మునిగిన పంట పొలాలు

మధురపూడి: గోదావరి నీటి మట్టం పెరగడంతో తొర్రిగెడ్డ కాలువ ద్వారా వరదనీరు పంట పొలాలను ముంచెత్తింది. దీంతో కోరుకొండ మండలం బుచ్చెంపేట, జగన్నాథపురం, బూరుగుపూడి, కాపవరం, మునగాల గ్రామాల్లోని పంట పొలాలు నీట మునిగాయి. అయితే వరద పెరగడంతో మూడు వేల ఎకరాల్లోని పంట నీటిమయం అయ్యింది. దీంతో నాట్లు వేసిన వరి మడుల్లోని నీరు నిల్వ ఉండిపోయింది. వారం రోజులు పైబడి నీరు మడుల్లో ఉండటంతో పంట నష్టపోయినందుకు రైతులు దిగాలు పడుతున్నారు. మెరక పొలాల్లోని ఆకుమడులు సైతం మునిగిపోవడంతో ఆకు కుళ్లిపోయింది. పశువులకు పచ్చిమేత కొరత ఏర్పడింది. మేటు వేసిన ఎండుగడ్డి తడిసిపోవడంతో గ్రాసం అందించడం కష్టతరమవుతోందని పాడి రైతులు ఆందోళన చెందుతున్నారు. పశువులకు గ్రాసం అందించాలని పాడి రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.


జగన్నాథపురం-మునగాల మధ్య మునిగిన పంట పొలాలు

చెత్త తొలగింపు


మర్రిపూడిలో చెత్తను తొలగిస్తున్న పారిశుధ్య సిబ్బంది


మర్రిపూడిలో చెత్త ఉన్న ప్రాంతం (ఫైల్)

స్పందించిన అధికారులు

సాక్షి ఇంపాక్ట్

రంగంపేట: మండలంలోని మర్రిపూడి గ్రామంలో ఉన్న ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం చుట్టూ అపరిశుభ్రత తాండవిస్తోందంటూ 'సాక్షి'లో ఆదివారం 'ఆరోగ్య మందిరం చుట్టూ అపరిశుభ్రత' అనే శీర్షికన కథనం వెలువడింది. దీనిపై ఆదివారం జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులు స్పందించారు. మర్రిపూడిలోని వెల్‌నెస్ సెంటర్‌కు సైడ్ వాల్స్ లేకపోవడంతో దీని చుట్టూ చెత్త వేయకుండా గ్రీన్ క్లాత్ వేస్తామని అధికారులు తెలిపారు. అలాగే పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడి చెత్త వేయకుండా చూస్తామన్నారు. సర్పంచ్ వేము మాధవి ఆధ్వర్యంలో వైద్యారోగ్య సిబ్బంది పర్యవేక్షణలో పంచాయతీ పారిశుధ్య కార్మికులు చెత్తను తొలగించారు. పరిసరాల్లోని పిచ్చి మొక్కలను తొలగించి, పారిశుధ్య పరిస్థితిని మెరుగుపర్చడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

మబ్బుల చాటుకు సూరీడు


చీకటి మబ్బుల వెనుక దాగి.. కాంతులు విరజిమ్ముతున్న భానుడు

రాజానగరం: భగభగ మంటూ తన ప్రచండ కిరణాలతో జనాన్ని ఉక్కిరిబిక్కిరి చేసి, చెమటలు పట్టించే సూరీడు, కారు మబ్బుల్లో చిక్కుకున్నాడు. ఇంకేముంది తనకు కూడా కాస్త చల్లదనం కావాలనుకున్నాడో గోపికల కొంగుచాటుకు వెళ్లిన గోవిందుడిలా, మబ్బుల చాటుకు అడుగులు వేస్తున్నాడా అన్నట్టుగా ఉంది కదూ ఈ దృశ్యం. ఆకాశంలో ఆదివారం సాయంత్రం రాజానగరంలో కనిపించి ఈ దృశ్యం ఎందరినో ఆకట్టుకుంది.

చనిపోయినా..

ఇద్దరి జీవితాల్లో వెలుగు


సాయి గణేష్ (ఫైల్)

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఆ బాలుడు చనిపోయి ఇద్దరి జీవితాల్లో వెలుగు నింపాడు. 13 ఏళ్ల కేవీవీ సాయిగణేష్ అనారోగ్యంతో ఆదివారం మృతిచెందాడు. రామచంద్రపురం మండలం ఊడుమూడి గ్రామానికి చెందిన సాయిగణేష్ ఏడో తరగతి చదువుతున్నాడు. తండ్రి కార్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గత ఐదు నెలల క్రితం ఆ బాలుడికి తలలో రక్త కణితి ఏర్పడింది. దీంతో బొమ్మూరు పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న తన మేనమామ సోమేశ్వరరావు ఇంటిలో ఉండి రాజమహేంద్రవరంలోని ఒక న్యూరో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అయితే సాయి గణేష్ కొన్ని గంటల్లో మృతిచెందుతాడు అని వైద్యులు తల్లిదండ్రులకు చెప్పారు. వైద్యులు చెప్పిన విధంగానే ఆ బాలుడు మృతిచెందాడు. బాలుడు మేనమామ సోమేశ్వరరావు చొరవతో పుట్టెడు దుఃఖంలోను తల్లిదండ్రులు సాయిగణేష్ రెండు నేత్రాలను దానం చేయడానికి ముందుకు వచ్చారు. నిడదవోలులోని ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్ట్యూట్‌కు సాయిగణేష్ నేత్రాలను అందించారు.

వరదను చూసేందుకు పోటెత్తిన జనం


రద్దీగా మారిన ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజ్ వద్ద ఉగ్రరూపం దాల్చిన గోదావరిని చూసేందుకు ఆదివారం సందర్శకులు పోటెత్తారు. గత వారం రోజులుగా పెరుగుతూ వస్తున్న గోదావరి ఆదివారం రెండవ ప్రమాద హెచ్చరిక దాటి ప్రవహిస్తుండటంతో పరిసర ప్రాంత ప్రజలు పెద్ద ఎత్తున కాటన్ బ్యారేజీకి తరలి వచ్చారు. ఆదివారం కావడంతో కుటుంబాలతో సహా పెద్ద ఎత్తున కాటన్ బ్యారేజీ సందర్శనకు వచ్చారు. బ్యారేజీ రోడ్డు కార్లు, మోటారు సైకిళ్లతో కిక్కిరిసింది. ఉగ్ర గోదారితో సెల్ఫీలు తీసుకునేందుకు పలువురు ఆసక్తి చూపారు. అధిక సంఖ్యలో సందర్శకులు తరలి రావడంతో పోలీసులు అదనపు బందోబస్తును ఏర్పాటు చేశారు.

క్లుప్తంగా

సూర్యదేవుడికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో సూర్యనారాయణమూర్తి స్వామి

పెదపూడి: ప్రసిద్ధి చెందిన జి.మామిడాడ గ్రామంలోని ఉష, ఛాయ, పద్మ, సౌంజ్ఞ సమేత సూర్యనారాయణమూర్తి ఆలయంలో ఆదిత్యునికి ఆదివారం ప్రత్యేక పంచామృతాభిషేక పూజలు చేశారు. స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి వెంకటనరసింహాచార్యులు ఉదయం విశేష వ్రత పూజలు నిర్వహించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకుని. ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

కోరుకొండ తహసీల్దార్ రాజ్యలక్ష్మి బదిలీ

అభినందన పూర్వక సత్కారం


బదిలీ అయిన రాజ్యలక్ష్మిని సత్కరిస్తున్న అధికారులు

మధురపూడి: కోరుకొండ తహసీల్దార్ డి.రాజ్యలక్ష్మి బదిలీ అయ్యారు. ఆమెను ఆదివారం డిప్యూటీ తహసీల్దార్ నరేష్ ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఘనంగా సత్కారం నిర్వహించారు. ఎన్నికల సందర్భంగా ఇక్కడికి వచ్చిన ఆమెను ప్రభుత్వం ఎన్నికల అనంతరం బదిలీ అయ్యారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఎస్. నరేష్‌కుమార్, ఎంఎస్‌ఓ లంక సునీత, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్, ఆర్.ఐ. ఎస్.హరిబాబు, వీఆర్వోల సంఘం అధ్య క్షుడు కొవ్విడి రామకృష్ణ, వీఆర్వోలు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొడదాం


సమావేశంలో మాట్లాడుతున్న మధు

రాజమహేంద్రవరం సిటీ: కేంద్ర, రాష్ట్ర పాలకులు కార్మిక సంస్కరణల పేరుతో కార్మిక సంఘాలను ఎత్తివేసి కార్మిక లోకానికి అన్యాయం చేస్తున్నారని దీన్ని తిప్పికొట్టాలంటే కార్మిక లందరూ ఐక్యంగా ఉండాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో కూరగాయల సెక్షన్ 22వ మహాసభ నిర్వహించారు. పది సంవత్సరాలుగా ప్రత్యేక హోదా కోసం సీపీఐ పోరాడుతూ ఉందన్నారు. గడచిన ఐదు సంవత్సరాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అప్పుల ఊబిలో మునిగిపోయిందన్నారు. ఏ ప్రభుత్వాలు ఉన్నప్పటికీ అప్పులు తప్పని పరిస్థితి ఉందన్నారు.

రాష్ట్ర అభివృద్ధి ప్రత్యేక హోదాతోనే సాధ్యమని అన్ని రాజకీయ పార్టీలు కలసి హోదా సాధించాలన్నారు. ఇప్పుడు కేంద్రంలో కొనసాగుతున్నది బీజేపీ సర్కారు కాదని ఎన్డీఏ సర్కార్ అని గుర్తు చేశారు. బీహార్ అసెంబ్లీ ప్రత్యేక హోదా కోసం తీర్మానం చేసి కేంద్రానికి పంపిందన్నారు. ఈ దిశగా ఏపీ కూడా ముందుకు వెళ్లాలన్నారు. పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముప్పాళ్ల సుబ్బారావు, ఏఐటీయూసీ రాష్ట్ర కోశాధికారి బీవీ కొండలరావు, జట్ల సంఘం ప్రధాన కార్యదర్శి సప్ప రమణ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


రమేష్ (ఫైల్)

కడియం: కడియపుసావరం గ్రామానికి చెందిన దిడ్ల రమేష్ (29) విద్యుదాఘాతంతో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రమేష్ మల్లెతోట సాగు చేయడంతో పాటు, సౌండ్ సిస్టమ్ ఏర్పాటు చేసి ఉపాధి పొందుతుంటాడు. ఎప్పటి లాగే గ్రామంలో సౌండ్ సిస్టమ్ ఏర్పాటు చేసి, కార్యక్రమం అనంతరం సహాయకుడు ఎం.రాజుతో కలిసి తొలగిస్తున్నాడు. ఈ క్రమంలో విద్యుత్ సరఫరా అవుతున్న వైరును గమనించక చుట్టే ప్రయత్నంలో విద్యుదాఘాతానికి గురయ్యాడు. దీంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. రాజుకు సైతం విద్యుత్ షాక్ తగిలినా అంతగా గాయపడలేదు. కాగా స్థానికులు రమేష్‌ను కడియం ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుంచి రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు ధ్రువీకరించారు. రమేష్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రమేష్‌కు భార్య చిన్ని, కుమార్తె అక్షయ, కుమారుడు సందీప్ ఉన్నారు.

ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

సీతానగరం: మండలంలోని రఘుదేవపురం పంచాయతీ కార్యదర్శి అప్పారావును జిల్లా కలెక్టర్ ప్రశాంతి సస్పెండ్ చేశారు. ఆదివారం వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు రాపాక వద్ద ముంపు పొలాలను పరిశీలించడానికి వచ్చారు. అదే రోడ్డు మార్గంలో వెళుతూ రాపాక శివారున రోడ్డు పక్కగా డంపింగ్ యార్డ్‌ను తలిపించేలా పంచాయతీ ఆధ్వర్యంలో చెత్తను వేయడంతో రఘుదేవపురం పంచాయతీ కార్యదర్శి అప్పారావును కలెక్టర్ సస్పెండ్ చేశారు. డయేరియా విస్తరిస్తుంటే శానిటేషన్‌పై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రఘుదేవపురం పంచాయతీలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న అప్పారావు ప్రస్తుతం ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్నారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వరాదు

బిక్కవోలు: డ్రైవింగ్ అర్హత రాకుండా మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని ఎస్సై పి.బుజ్జిబాబు అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పిల్లలకు వాహనాలు ఇచ్చాక, ఏమైనా ప్రమాదాలు జరిగితే ఆ కేసుల నుంచి బయటపడటం చాలా కష్టమన్నారు. సెలవు దినాల్లో పిల్లలు ఎక్కువగా బైక్‌లపై తిరుగుతుండడం తమ దృష్టికి వచ్చిందన్నారు. డ్రైవింగ్‌పై అవగాహన లేకుండా వాహనాలు నడిపే యువకులు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపే వారిపై చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.

తహసీల్దార్ల బదిలీ

రాజానగరం: సార్వత్రిక ఎన్నికల సమయంలో జరిగిన అధికారుల బదిలీలలో భాగంగా నియోజకవర్గంలోని మూడు మండలాలకు వచ్చిన తహసీల్దార్లను తిరిగి పూర్వపు స్థానాలకు బదిలీ చేస్తూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు రాజానగరం తహసీల్దారుగా ఉన్న అబ్దుల్ రహమాన్ మస్తాన్‌ని కృష్ణా జిల్లాకు బదిలీ చేసి, ఎలక్షన్ డీటీగా ఉన్న పి.సునీతను ఇన్‌చార్జి తహసీల్దారుగా నియమించారు. సీతానగరం తహసీల్దారు నెల్సన్ పాల్‌బాబును, కోరుకొండ తహసీల్దారు పి.రాజ్యలక్ష్మిని కూడా కృష్ణా జిల్లాకు బదిలీ చేశారు. వారి స్థానంలో సీతానగరానికి డీటీ పి.సర్వేశ్వరమూర్తిని, కోరుకొండకు డీటీ ఎస్‌వీ నరేష్‌ని నియమించారు.

అవధాన బ్రహ్మలు తిరుపతి కవులు

ప్రకాశం నగర్ : అవధానాలతో తెలుగు దేశమంతా జైత్రయాత్ర సాగించిన అవధాన బ్రహ్మలు తిరుపతి వెంకటకవులు అని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆదివారం కళాగౌతమి ఆధ్వర్యంలో స్థానిక నృత్య కళాక్షేత్రంలో తిరుపతి వెంకటకవులపై సభ జరిగింది. సుదర్శన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సభకు అధ్యక్షత వహించిన కళాగౌతమి వ్యవస్థాపకులు మూర్తి మాట్లాడుతూ, తిరుపతి కవులు వంద సంస్కృత, తెలుగు గ్రంథాలు, నాటకాలు, అనువాద గ్రంథాలను రచించారని తెలిపారు. కళాగౌతమి అధ్యక్షుడు సంజీవరావు, నీలకంఠరావు, సప్పా దుర్గాప్రసాద్ ప్రసంగించారు.